



## తారుమారు

నేను సుదర్శన్ ఇంటర్మీడియేట్ పరీక్షాఫలితాలకోసం ఆత్రుతతో ఎదురు చూచిన రోజులవి. ఆనాడు మామయ్యా మద్రాసువెళ్తూ నాతో అన్నాడు 'ఒరేయ్ రామూ! ఇంటర్ రిజల్ట్సు మద్రాసులో ఓరోజుముందే తెలుస్తయ్ కనక మీ నెంబర్లిచ్చారంటే ముందుగానే 'వైర్' చేస్తాను.' ఈమాట విన్న సుదర్శన్ వెంటనే ఓ చిన్న కాగితంముక్కపై చక్కగా '9669' అని తన నెంబరు వ్రాసి మామయ్యా చేతికిచ్చాడు. మామయ్యా చీటిని చూడకుండా నే పర్సులో వుంచుకొని వెళ్లిపోయాడు.

ఆరోజు నేను సుదర్శన్ బాతాఖానీ చేస్తుంటే వచ్చింది టెలిగ్రాం 'ఇద్దరూ ఫస్టుక్లాసులో ప్యాసయినందుకు హృదయపూర్వక అభివందనాలు' అని. ఇక సుదర్శన్ ఆనందం చెప్పడానికి వీల్లేదు. మరి ఫేలయిపోతాననే వాడికి క్లాసువస్తే సంతోషం కదూ? ఆ సాయంత్రం జోరుగా టీ పార్టీ చేసి 15 రూ. చేతిచమురు వదిలించుకొన్నాడు.

మరునాడు పేపరువచ్చేసరికి, అతని నెంబరు ఫస్టుక్లాసు జాబితాలో లేదు. సరికదా మామూలు ప్యాసులిస్టులో కూడలేదు. 'వాడు పేపర్సులో ప్రింటర్సు డెవిల్ వుంటుంది హిందూలో చూడరా!' అన్నాడు సుదర్శన్ ధీమాగా. ఊహూ కంచు కాగడా పెట్టి వెదికినా ఎక్కడా అతని నెంబరు లేదు. 'మీ మామయ్యా ఇలా చేస్తాడనుకోలేదురా!' అన్నాడు మొహం దిమ్మిడీ అంత చేసుకొని.

మా మామయ్యా అలాంటి అజాగ్రత్త మనిషి కాడు; అయినా వుండబట్టక వ్రాసా అతని నెంబరు ఫలానా జాగ్రత్తగా చూచారా అని మరు టపాలో జవాబు "చాల పొరపాటు జరిగింది కాని ఇందులో నా తప్పేమిలేదు. ఆ నీ మిత్రుడు వ్రాసి ఇచ్చిన కాగితం ముక్కను తల్లక్రిందుగా చూచాను అది '6996' లా కనపడింది. ఆ నెంబర్ని ఫస్టుక్లాసులో చూచి తంతి ఇచ్చాను. ఇలా తప్పుల ట్రాజడీ అయినందుకు నీ మిత్రునికి నా హృదయపూర్వక సానుభూతి."

" రాము. "

* * *

## తెలివి

మూర్తి చాల తెలివిగల వాడని మా వూరి రాజు విని చిన్న మూతిగల కడవను ఒకదానిని మూర్తివద్దకు పంపుచు 'నీతెలివిని దీనిలో నిండించి పంపుము' అని చెప్పి పంపెను.

రాజు తన్నుపరిహసించుచున్నాడని మూర్తిగ్రహించి ఆ కడవనుగొని గుమ్మిడి పాదలోనుంచి ఒక పిందెను ఆ కడవలోనికి పోనిచ్చెను. అది కడవలోనే పెరిగి పెద్దదయ్యెను. తదనంతరము మూర్తి గుమ్మిడి కాడను త్రుంచి రాజు నొద్దకు పంపుచు 'నా తెలివిని ఈ కడవలో పంపుతున్నాను. తమ తెలివితో ఈ కడవను పగులగొట్టక దీనిలోని గుమ్మిడికాయను బయటికి దీయుడు' అని చెప్పిపంపెను. రాజు అతని తెలివికి మెచ్చుకొని బహుమతు లిచ్చి పంపెను.

పేరంబాకు పరంజోతిబాయి.

## ఒకటీ, రెండూ, మూడూ

పూర్వం ఒక ఆసామీ పట్నంలో చదివితే బుద్ధి వికసిస్తుందని తన కొడుకుని పట్నం పంపేడట చదువుకోమని. మధ్యని ఏవో దసరాశలవలు వస్తే ఆ కుర్రవాడు తన స్వగ్రామం వచ్చాడు. పట్నంలో తను సంపాదించిన విజ్ఞానం వెళ్ళబోయడానికి సమయంకోసం ఎదురుచూస్తున్నాడట. మరునాడు వాడికి వాడి చెల్లెలికి భోజనం పెడుతూ వాళ్ళ తల్లి ఆ కుర్రవాడి విస్తర్లో రెండు మిఠాయి ఉండలు వేసింది. వాడు తన తెలివితేటలు ప్రదర్శిద్దామని చెల్లెలుతో అన్నాడు. "చెల్లీ చూశావా యిక్కడ రెండు మిఠాయి ఉండలు ఉన్నాయి కదా చూడు వీటిని మూడుచేస్తాను" అని. పాపం ఆ పల్లెటూరి అమాయకపు పిల్ల తన అన్నగారు పట్నములో ఏమి నేర్చివచ్చాడో అని "సరేచెయ్యి" అంది. అతడు (పట్నంలో ఏనాడు మోళీ సాయేబువద్ద చూశాడో) "ఇదిగో ఒక ఉండ, యిదిగో రెండు ఉండ, ఒకటి రెండు కలిసి మూడు ఉండ" అని "చూశావా మూడుండలు చేశాను" అన్నాడు. ఆ పిల్లకి వెంటనే ఓ కొంటె ఆలోచన తట్టింది. "అయితే అన్నయ్యా! మూడుండలు చేశావుకదా నా కొకటి యిచ్చి అమ్మకి ఒకటి యిచ్చి మూడో ఉండ నువ్వుతిను" అన్నాది. అంతే అబ్బాయిగారి ముఖం అమావాస్యచంద్రుడులా అయింది. కాని మనస్సులో మాత్రం సంతోషించాడుట, రేపు తను మోళీ సాయేబు వద్ద యీలాగంటే అందరూ తన తెలివితేటల్ని ఎంత ప్రశంసిస్తారో అని ఊహించుకుంటూ.

జి. వి. అప్పారావు పంతులు.